


సమావేశంలో పాల్గొన్న సీపీ, కలెక్టర్లు తదితరులు

## బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

### పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

హనుమకొండ, అక్టోబర్ 28 : ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్యతో కలిసి జిల్లా ఇంటెలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల మార్గదర్శకాలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వి డుదల కావడంతో జిల్లాలో నియమించిన టీంలు నిబద్ధతతో కలిసి పనిచేస్తూ రోజు వారీ నివేదికలను అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో అక్రమ మద్యం, నగదుపై గట్టి నిఘా ఉంచాలన్నారు. పట్టుకున్న నగదు జమకు సత్వరమే అకౌంట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టులలో నిఘా పెంచి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నగదు దొరికితే గ్రీవెన్స్ కమిటీకి ఆధారాలతో సమర్పించాలని సూచించారు. సరైన ఆధారాలు సమర్పించిన వారి నగదును నిబంధనల ప్రకారం విడుదల చేయాలన్నారు. అకౌంట్లలో నగదు బదిలీలను అలాగే, లావాదేవీలు నిరంతరం పరిశీలించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. రో జూ వాణిజ్య పరమైన లావాదేవీలపై కూడా నిరంతరం నిఘా ఉంచి, తనిఖీలు చేయాలని సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణపై ఉన్నత స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, అధికారులు విధుల్లో ఏ మా త్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఫిర్యాదులపై నోడల్ అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని సీపీ స్పష్టం చేశారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ సీజ్ చేసిన నగదు, బంగారం ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నపుడు సరైన పత్రాలతో రికార్డ్‌లో నమోదు చేయాలన్నారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి, శానిటైజేషన్, తాగు నీరు, విద్యుత్ తదితర సమస్యలుంటే వెం టనే పరిష్కరించాలన్నారు. వచ్చే వారం రాష్ట్ర స్థాయి ఎన్నికల అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వస్తున్నారని, ఈ నేపథ్యంలో అధికారులు సమగ్ర నివేదిక వివరాలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, అశ్వినీ తానాజి, డీఆర్వో గణేశ్, డీసీపీ బారి, లోకల్ బాడి, ట్రైనీ కలెక్టర్, రెవెన్యూ, నోడల్, ఇంటెలిజెన్స్, ఎక్సైజ్, ట్రెజరీ, ఇన్‌కం ట్యాక్స్ అధికారులు, డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

హనుమకొండ, అక్టోబర్ 28 : దేశంలో ప్రజాస్వామ్యం కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా తెలిపారు. శనివారం హనుమకొండ ఏకశిల పార్క్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు అంగన్‌వాడీ టీచర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. శ్రద్ధా శుక్లా ముఖ్యఅతిథిగా హాజరై ఓటరు ప్రతిజ్ఞ చేయించి, జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో రాబోయే 8 నెలల్లో 4 సార్లు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం వస్తుందన్నారు. ఓటు వేయడాన్ని బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలు ఇంటికి కేవలం 2 కిలోమీటర్ల దూరంలోనే ఉంటాయన్నారు. దివ్యాంగులు, వృద్ధులు ఓటు వేసేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. గత ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 59 శాతం పోలింగ్ నమోదైందన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో 100 శాతానికి పెంచేందుకు ఓటరు అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ భద్రు నాయక్, ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ హరి ప్రసాద్, జిల్లా సంక్షేమాధికారి కే మధురిమ, మెప్మా డీఎంసీ రజితా రాణి, ఏడీసీ ఎంసీ వెంకట్‌రెడ్డి, సీవోలు శ్రీనివాస్, నాగరాజు, రమేశ్, శ్రీలత, స్వాతి, సునీల్, అర్‌పీలు, మహిళా సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ఏకశిల పార్కు వద్ద ఓటరు అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

# అభివృద్ధి నిరోధకులను ఇంటికి రానివ్వొద్దు

- కేసీఆర్ పాలనే రాష్ట్రానికి రక్షణ
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణ సుభిక్షం
- పశ్చిమలో గులాబీ జెండా ఎగురడం ఖాయం
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- కాజీపేటలో ఇంటింటా ప్రచారం




కాజీపేటలో చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌కు స్వీటు తినిపిస్తున్న వృద్ధుడు

కాజీపేట, అక్టోబర్ 28 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఆపేందుకు ప్రయత్నిస్తున్న రాబందులను ప్రజలు ఇంటికి రానివ్వొదని పశ్చిమ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కాజీపేటలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా సీఎం కేసీఆర్ తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్ పాలనను, బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఎన్నికల వేళ ప్రతిపక్ష పార్టీలు అభివృద్ధిని సైతం అవహేళన చేస్తూ పబ్బం గడుపుతున్నాయన్నారు. కేసీఆర్ పాలనే తెలంగాణ రాష్ట్రానికి శ్రీరామ రక్ష అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు ఏం అభివృద్ధి చేశాయో ప్రజలకు చెప్పలేని స్థితిలో ఇక్కడి నాయకులు ఉన్నారన్నారు. నియోజకవర్గంలోని వాడల్లో ప్రతిపక్ష నాయకులను తిరుగకుండా చేయాలన్నారు. వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, ఓటర్లు అవగాహనతో ఆలోచించి, ఓటు వేయాలని కోరారు. ఎన్నికలు అనగానే ఎక్కడైనా నాయకుడి నుంచే డబ్బులు తీసుకుంటారని, అదే నాయకుడికి తిరిగి ఎన్నికల ఖర్చుకు డబ్బులు ఇచ్చే సంప్రదాయం తన నియోజకవర్గంలో ప్రజలకు ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ సేవకుడిగా ఉంటానన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. రాష్ట్రంతో పాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో మళ్లీ భారీ మెజార్టీతో గులాబీ జెండాను ఎగురవేయడం ఖాయమన్నారు. నవంబర్ 30న జరుగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

**కార్యకర్తలను కాపాడుకుంటా**

బీఆర్ఎస్ పార్టీలో చేరిన కార్యకర్తలకు అండగా ఉంటూ, కంటికి రెప్పలా కాపాడుకుంటానని నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాజుల విజయ్ తన వంద మంది అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ చీఫ్‌విప్ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, డివిజన్ అధ్యక్షుడు, దువ్వ కనకరాజు, ఇన్‌చార్జి శిరుమల్ల దశరథం, అఫ్జల్, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, నయీం జుబేర్, మర్యాల కృష్ణ, సిరిల్ లారెన్స్, ఫర్హాన్, గబ్బెట కరుణ్, నరేశ్, శంకర్, పోతుల సాంబయ్య, కొంపెల్లి లక్ష్మణ్, ఫర్వీన్, కొలిపాక శివకుమార్ పాల్గొన్నారు.

## వినయ్‌భాస్కర్‌కు కాజీపేట వ్యాపారుల మద్దతు

కాజీపేట : కాజీపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌ను ఆల్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వర్తక వాణిజ్య, వ్యాపారులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు వ్యాపారులు తీర్మానం చేశారు. వినయ్‌భాస్కర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మూకుమ్మడిగా వాగ్దానం చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ తన గెలుపు కోసం సంపూర్ణ మద్దతును ప్రకటించిన ఆల్ ట్రేడర్స్ అసోసియేషన్ సభ్యులు, వర్తక వాణిజ్య, వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో నియోజక వర్గంలో బరిలో ఉన్న తనను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వర్తక వాణిజ్య వ్యాపార సంస్థలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ ఆల్ ట్రేడర్స్ అసోసియేషన్, కిరాణం జనరల్ స్టోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెనివెట్టి రఘు, కిరాణం అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎలుగూరి వేణుగోపాల్, కోశాధికారి మహేందర్, యాదగిరి, తోట శివాజి, రంజిత్, విజయ్, దీప్, జవాన్ దేశాయ్, వ్యాపారులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ తదితరులు


# ప్రజా క్షేత్రంలోనే తేల్చుకుందాం

- 'పశ్చిమ'లో గులాబీ జెండా ఎగరేస్తాం
- ఓటమి భయంతోనే నాయిని విమర్శలు
- విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్

హనుమకొండ, అక్టోబర్ 28 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్‌పై కాంగ్రెస్ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి వ్యక్తిగత, ప్రత్యక్ష, పరోక్ష ఆరోపణలు మానుకొని, ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీన్‌ఖాన్ సవా ల్ విసిరారు. శనివారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్‌గౌడ్, కార్పొరేటర్లతో కలిసి అజీజ్‌ఖాన్ విలేకరులతో మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుడు నాయిని రాజేందర్‌రెడ్డి అమ్ముడు పోతున్నాడని ఆ పార్టీ నాయకులే ఆరోపిస్తుంటే.. దాని వెనుక వినయ్‌భాస్కర్ ఉన్నాడని రాజేందర్‌రెడ్డి అనడం హస్యాస్పదంగా ఉందన్నారు. ఆదిలోనే నాయినికి ఓటమి భయం పట్టుకుందన్నారు. అందుకే వినయ్ భాస్కర్‌పై నిరాధార, అసత్య ఆరోపణలు చేస్తూ, కుట్రలు కుతంత్రాలకు తెరతీస్తున్నాడని మండిపడ్డారు. ప్రమాణాల పేరుతో రాజకీయాలు చేసే సంప్రదాయం, ఇచ్చిన మాట తప్పే అలవాటు వినయ్‌భాస్కర్‌కు లేదన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు నిందలు వేయడం నాయినికి పరిపాటిగా మారిందన్నారు. నాయిని నికార్సైన నాయకుడైతే 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ టికెట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. నాయిని రాజేందర్‌రెడ్డి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, ఆరోపణలు చేసినా నియోజకవర్గ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వరంగల్ పశ్చిమలో తిరిగి గులాబీ జెండా ఎగరడం ఖాయమన్నారు. దాస్యం వినయ్ భాస్కర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని నాయిని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. 45 ఏళ్ల రాజకీయ చరిత్ర ఉన్న వ్యక్తిపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. ఏదైనా ఉంటే ఎన్నికల్లో తేల్చుకుందామని సవాల్ విసిరారు. సమావేశంలో కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, చెన్నం మధు, సోదా కిరణ్, చీకటి శారదా ఆనంద్, గుంటి రజితా శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, ఉడుతల సారంగపాణి, మిర్యాల్‌కార్ దేవేందర్, వీరగంటి రవీందర్, మైనార్టీ రాష్ట్ర నాయకుడు నయీముద్దీన్, నజీర్ పాల్గొన్నారు.

## 'బీఆర్ఎస్ వెంటే అపార్ట్‌మెంట్‌వాసులు'

హనుమకొండ, అక్టోబర్ 28 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని అపార్ట్‌మెంట్‌వాసులందరూ బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉన్నారని అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం నియోజకవర్గం పరిధిలోని అపార్ట్‌మెంట్లలో దాస్యం వినయ్ భాస్కర్ తరుపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ అపార్ట్‌మెంట్లలోని నివాసితులను ఓటు అడిగే హక్కు దాస్యం వినయ్‌భాస్కర్‌కే ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలో అపార్ట్‌మెంట్ దర్శన్ పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, ప్రతి ఆదివారం ఒక అపార్ట్‌మెంట్‌కు అధికారులతో వచ్చి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారన్నారు. అపార్ట్‌మెంట్ వాసులందరూ దాస్యంకు రుణపడి ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో రుణం తీర్చుకుంటారన్నారు. వినయ్ భాస్కర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు గుర్రాల ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నడుముల విజయ్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ప్రసాద్‌రెడ్డి, కొమురవెల్లి శ్రీనివాస్, సిరి అపార్ట్‌మెంట్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్‌లో ప్రచారం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు